క్లుప్తంగా

ఇందిరమ్మ కాలనీలో కార్డెన్‌సెర్చ్

బి.కొత్తకోట: పట్టణ సమీపంలోని ఇందిరమ్మకాలనీలో శుక్రవారం తెల్లవారుజామున సీఐ సూర్యనారాయణ ఆధ్వర్యంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. వాహనాలు, స్థానికులు, గుర్తు తెలియని వ్యక్తులపై ఆరా తీసి ప్రశ్నించారు. ఈ సందర్భంగా స్థానికులతో సీఐ మాట్లాడుతూ ఎక్కడెక్కడో నేరాలకు పాల్పడే వ్యక్తులు ఇలాంటి చోట్ల తలదాచుకునే అవకాశం ఉందన్నారు. వీరివల్ల ఇబ్బందులు తలెత్తుతాయని వారికి ఆశ్రయం కల్పించవద్దని కోరారు. చోరీలు, రికార్డులు లేని వాహనాలు నడపడం నేరమని, ఎవరైనా ఇలాంటి వాటిని విక్రయిస్తుంటే కొనుగోలు చేయవద్దని కోరారు. అనుమానితుల సంచారంపై అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కలకడ తహసీల్దార్‌గా ప్రియదర్శిని



కలకడ : మండల తహసీల్దార్‌గా వి.ప్రియదర్శిని శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా నంద్యాల ఆర్డీఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి (ఏఓ)గా విధులు నిర్వహించిన ప్రియదర్శినిని బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. ఇక్కడి పనిచేస్తున్న తహసీల్దార్ ప్రదీప్ అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

ప్రభుత్వ భూమిలో చెట్లు నరికివేత

కలకడ : ప్రభుత్వ భూములు, చెరువులు, కాలువలల్లోని చెట్లకు రక్షణ కరువైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ బాపనచెరువు ఆయకట్టులోని వేప, చిగురు వంటి విలువైన చెట్లను కొందరు వ్యాపారులు ఎలాంటి అనుమతులు లేకుండా నరికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. రెవెన్యూ, పోలీస్ ఉన్నతాధికారులు అక్రమార్కులపై చర్యలు తీసుకుని చెట్లను కాపాడాలని కోరుతున్నారు.

ఆదర్శ డిపోగా తీర్చిదిద్దాలి

మదనపల్లె సిటీ: ఉద్యోగులందరూ కలిసి ఆదర్శ డిపోగా తీర్చిదిద్దాలని ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ వన్ డిపోలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ జనవరి నెలలో ఈపీకె, కెఎంపిఎల్ అధికంగా సాధించి రీజియన్ పరిధిలో మొదటి స్థానం నిలిచినట్లు పేర్కొన్నారు. ఈపీకె అత్యధికంగా కెఎంపిఎల్ సాధించిన డ్రైవర్లు ఏంఆర్ కృష్ణ, ఎస్‌జడ్ బాబు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన టైర్ ఏడీసీ బీడీ స్వామి, మెకానిక్ గోపాలకృష్ణ, ఆదాయం ఎక్కువ తెచ్చిన కండక్టరుల ఆర్ఎస్ రాజు, ఎస్ ఎస్.వాసులు, రమణకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. సమావేశంలో జ్ఞానోదయ పాఠశాల కరస్పాండెంట్ ప్రసాదరావు, సీఐ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా ధ్వంసం

రామసముద్రం: మండలంలోని అరికెల పంచాయతీ గోసువారిపల్లె గ్రామ సమీపంలో శుక్రవారం నాటుసారా కాస్తుండగా ఎస్ఐ చంద్రశేఖర్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి. పుంగనూరు మండలం మిట్టచింతపల్లి పంచాయతీ పట్రపల్లితాండాకు చెందిన బుడ్డానాయక్, బాలాజీనాయక్‌లు నాటుసారా తయారు చేసి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడిలో 60 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని, బుడ్డానాయక్, బాలాజీనాయక్‌లపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి

కేవీపల్లె : సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరణ డిమాండ్‌తో ఈ నెల 18న నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్ కోరారు. శుక్రవారం మండలంలోని నూతన కాల్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆర్థికనష్టం కల్గించేలా ఉన్న సీపీఎస్ విధానంను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హెచ్ఎం చంద్రయ్య, ఉపాధ్యాయులు వేణు, సుబ్రమణ్యం, కృష్ణ, మురళీ, సితార్, కవిత, మురళి, ముని తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లె తహసిల్దార్‌గా బాలాజీరాజు

నిమ్మనపల్లె : నిమ్మనపల్లి తహసీల్దార్‌గా ఆర్.బాలాజీ రాజు శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ సి.ఆర్. మంజుల ఇటీవల పదవీ విరమణ చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల బదిలీల్లో భాగంగా అనంతపురం జిల్లా నుంచి అన్నమయ్య కలెక్టరేట్‌కు వచ్చిన బాలాజీ రాజును నిమ్మనపల్లె తహసీల్దార్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

రోగులకు భోజనం ప్యాకెట్లు

మదనపల్లె : సేవా కార్యక్రమాలు భగవంతుని సేవతో సమానమని సర్పంచ్ పసుపులేటి చలపతి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రోగులకు, సహాయకులకు దాదాపు 200మందికి భోజనంప్యాకెట్లు, పండ్లు, అంబేద్కర్ సర్కిల్‌లో 150 మంది యాచకులకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు.

అక్కచెల్లెమ్మల జీవితాల్లో ఆర్థిక వెలుగులు



వాల్మీకిపురం: మహిళలకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే చింతల



గుర్రంకొండలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

- డ్వాక్రా మహిళలకు రూ.10.22 కోట్లు పంపిణీ
- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: అక్కచెల్లెమ్మల జీవితాల్లో ఆర్థిక వెలుగులు నింపాలనే లక్ష్యంతో వైఎస్సార్ ఆసరా పథకంలో బ్యాంక్ రుణమాఫీని సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వైఎస్సార్ ఆసరా అములులో భాగంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజా సంకల్పయాత్రలో ఆడపడుచులకు ఇచ్చిన హామీ మేరకు బ్యాంక్ రుణాన్ని నాల్గొవ విడత మంజూరు చేశారన్నారు. మొదటి, రెండు, మూడు విడతలు ఇప్పటికే ఆడపడుచుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసినట్లు గుర్తు చేశారు. నాల్గొవ విడతగా మండలంలోని 940 సంఘాలకు రూ.10.22 కోట్లు అందజేస్తున్నామని వివరించారు. సంక్షేమ ఫలాల లబ్ధిని మహిళల ఖాతాల్లో నేరుగా జమ చేసి అవినీతికి అవకాశం లేకుండా పారదర్శకంగా పథకాలను అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి డ్వాక్రా మహిళలు గుర్తు పెట్టుకోవాలన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలతో సీఎం జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఓ సుధాకర్ రెడ్డి, ఏపీఎం నరసింహులు, సర్పంచ్ గంగులమ్మ, శివానంద రెడ్డి, చింతల ఆనంద రెడ్డి, నీళ్ళ భాస్కర్, శ్రీధర్‌రాయల్, అబ్దుల్ కలీమ్, కేశవ రెడ్డి, ఆనంద, నరసింహులు, వెంకట్రమణ, కిరణ్ కుమార్, మహబూబ్‌బాషా, ఓరుగంటి రమేష్, లక్ష్మీనారాయణ రెడ్డి, రాయుడు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల పక్షపాతి సీఎం జగన్

కలికిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మహిళల పక్షపాతి అని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మెయిన్ స్కూల్ ఆవరణలో శుక్రవారం స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వం విడుదల చేసి నాల్గవ విడత ఆసరా పంపిణీ, వలంటీర్లు వందనం కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఎస్‌హెచ్‌జీ మహిళల సమస్యలను గుర్తించిన జగన్ మోహన్ రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే మహిళలను మహారాణులను చేసిన ఘనత సీఎంకు దక్కుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పసుపు కుంకుమ పేరుతో చెక్కులు ఇచ్చి మోసగించిన విషయం మహిళలు గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం మండల పరిధిలోని 856 ఎస్‌హెచ్‌జీలకు సంబంధించి 7805 మంది మహిళలకు మంజూరైన నాల్గవ విడత ఆసరా మెగా చెక్కును మహిళలకు అందజేశారు. అనంతరం వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా వలంటీర్లను దుశ్శాలువాలతో సత్కరించి, ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మెన్ నల్లారి తిమ్మారెడ్డి, ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్ రెడ్డి, శివాజీ, సర్పంచ్‌లు వెంకటరెడ్డి, గంగయ్య, తస్లీమారియాజ్, బీబీఇస్తియాక్, అరుణబాబురెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు రిజ్వానుల్లా, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి హరి, ఎంపీడీఓ రామక్రిష్ణ పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి

గుర్రంకొండ: ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగనన్నను మరోసారి ఆశీర్వదించి ముఖ్యమంత్రిని చేసే బాధ్యత మహిళలపై ఉందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలకేంద్రమైన గుర్రంకొండ జెడ్పీహైస్కూల్ మైదానంలో డ్వాక్రా మహిళలకు నాల్గవ విడత ఆసరా చెక్కును పంపిణీ చేశారు. ఉత్తమ వలంటీర్లుగా ఎంపికైనవారికి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ గుర్రంకొండ మండలానికి నాల్గవ విడత ఆసరా కింద 825 డ్వాక్రా గ్రూపులకు 7680 మహిళలకు రూ.31,53 కోట్లు జగనన్న డ్వాక్రా రుణాలను మాఫీ చేశారన్నారు. జగనన్న ఇచ్చిన మాట ప్రకారం ఐదేళ్లలోనాలుగు విడతలుగా మహిళలకు డ్వాక్రా రుణాలు మాఫీ చేయడం హర్షణీయమన్నారు. జగనన్నను మరోసారి ఆశీర్వదించి ముఖ్యమంత్రిని చేసే బాధ్యత మహిళలపై ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఇప్పుడు జగనన్న ఇస్తున్న పథకాలన్నింటిని రద్దు చేస్తారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ వాళ్లు చెప్పే కల్లబొల్లిమాటలన్ని నమ్మి మోసపోవద్దన్నారు కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రవినాయక్, జెడ్పీటీసీ సమ్రీన్ ముక్తియార్, మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి, వైస్ఎంపీపీ కరుణాకర్, సింగిల్‌విండో చైర్మన్ నక్కాచంద్రశేఖర్, మండల సచివాలయల కన్వీనర్ నాగేంద్ర, రెడ్డెమ్మకొండ చైర్మన్ నరసింహారెడ్డి, మాజీ ఎంపీపీ జమీర్, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, ఎల్వి రమణ పాల్గొన్నారు.

ఎన్నికల సమరానికి 'సిద్ధం'

- రాప్తాడు సమావేశాన్ని విజయవంతం చేయండి
- కార్యకర్తలకు పిలుపునిచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, నిసార్‌అహ్మద్

మదనపల్లె : ఎప్పుడు ఎన్నికలు వచ్చినా అందరం సిద్ధంగా ఉండాలని, ఈ మేరకు ఈనెల 18న అనంతపురం జిల్లా రాప్తాడులో వైఎస్సార్ సీపీ నిర్వహిస్తున్న ›సిద్ధం‹ రాయలసీమ సభను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మదనపల్లె మున్సిపాలిటీ, రూరల్, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పేదలకు, పెత్తందారులకు జరుగుతున్న యుద్ధంలో పేదలపక్షాన నిలబడి, ప్రతిపక్షాల కుట్రలను ఎదురొడ్డి పోరాడేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు సిద్ధం కావాలన్నారు. ఎన్నికల సమరానికి రాష్ట్రంలోని ఐదుప్రాంతాల్లో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సమావేశాలు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. అందులో భాగంగా మొదట ఉత్తరాంధ్రలోని భీమిలి, రెండోది ఉభయగోదావరి జిల్లాల్లో దెందులూరులో, మూడోసభ రాయలసీమలో అనంతపురంజిల్లా రాప్తాడులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కోఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న రాయలసీమ సమరానికి సిద్ధం సమావేశాన్ని 10 లక్షల మందితో అత్యద్భుతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు జరిగాయన్నారు. ప్రత్యర్థుల వెన్నులో వణుకు పుట్టించేలా మదనపల్లె నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో వైఎస్సార్ సీపీ శ్రేణులు హాజరవ్వాలన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ధర్మానికి, అధర్మానికి యుద్ధం జరగనుందని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమైనా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టిస్తాందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ ఆనందపార్థసారధి, మండల కన్వీనర్ దండుకరుణాకర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి, వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ ఎస్.ఏ. కరీముల్లా, మున్సిపల్ వైస్‌చైర్మన్ నూర్‌ఆజం, ఎన్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరురఫీ, కోటూరిఈశ్వర్, కౌన్సిలర్ బి.ఏ.ఖాజా, సర్పంచ్ సుబ్రహ్మణ్యం, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ప్రొఫెసర్ వెంకటరెడ్డికి మంత్రి పరామర్శ



రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటరెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

మదనపల్లె : మండలంలోని పుంగనూరువాండ్లపల్లెలో నివసిస్తున్న విశ్రాంత ప్రొఫెసర్ వెంకటరెడ్డిని శుక్రవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరామర్శించారు. ఇటీవల వెంకటరెడ్డి భార్య భాగ్యవతి మృతి చెందిన విషయం విధితమే. వెంకటరెడ్డి స్వస్థలం పుంగనూరు నియోజకవర్గంలోని అడవినాథునికుంట గ్రామం కావడం, చాలాకాలంగా వారి కుటుంబంతో మంత్రి పెద్దిరెడ్డికి సన్నిహిత సంబంధాలుండటంతో ఆయనను పరామర్శించేందుకు మదనపల్లెకు వచ్చారు. రిటైర్డ్ ప్రొఫెసర్ భాగ్యవతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో పీకేఎం-ఉడా చైర్మన్ ఎస్.వెంకటరెడ్డి యాదవ్, తట్టివారిపల్లె సర్పంచ్ సిద్ధలదీపా, సిద్ధలవేమారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు



వాల్మీకిపురం: తిరుమాఢ వీధుల్లో స్వామివారు



పీలేరు: పుష్పపల్లకీలో విహరిస్తున్న స్వామివారు

మదనపల్లె సిటీ: రథ సప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని సూర్యప్రభ వాహనంపై ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పాండు, ఈఓ రమణ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో..

వాల్మీకిపురం: స్థానిక శ్రీ పట్టాభిరామాలయంలో శుక్రవారం రథసప్తమి పురస్కరించుకొని స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చన, తోమాలసేవ, అలంకరణ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం తిరుమాఢ వీధుల్లో స్వామివారిని ఊరేగించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, ఆలయ అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరులో..

పీలేరురూరల్ : స్థానిక కోటపల్లె శ్రీ పద్మావతి అండాల్ సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రథసప్తమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలు శోభయమానంగా అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, కమిటీ సభ్యులు సి. రాజేష్, మధుసూదన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అర్చకులు వి.వి. రంగాచార్యులు, వి.వి. గోపీకృష్ణాచార్యులు పాల్గొన్నారు.

రామసముద్రంలో..

రామసముద్రం: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీజనార్ధనస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారధిబట్టర్, కులశేఖర్‌బట్టర్‌లు స్వామివారికి శ్రీసూర్యనారాయణ స్వామి అలంకారం చేశారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు , పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి ఉంజల్ సేవ, రాత్రి ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా ఆదర్శపాఠశాల వార్షికోత్సవం

రామసముద్రం: మండలంలోని దిన్నిపల్లి సమీపంలో ఉన్న ఆదర్శపాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మునస్వామినాయక్ మాట్లాడుతూ విద్యా ర్థులు తమ లక్ష్యాన్ని చేరుకనేందుకు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. ఉన్నత స్థాయికి చేరుకొని చదువుకున్న పాఠశాలకు , తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

రాజీ మార్గమే రాజమార్గం



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ జడ్జి జ్యోతి

వాల్మీకిపురం: స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణంలో మార్చి 9వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ జూనియర్ సివిల్ జడ్జి జ్యోతి తెలిపారు. శుక్రవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కక్షిదారులు రాజీ మార్గం ద్వారా వారి కేసులను పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ చక్కటి వేదిక అని తెలిపారు. కార్యక్రమంలో సిఐ పులిశేఖర్, ఎస్ఐలు నాగేశ్వర రావు, నాగార్జున రెడ్డి, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సమష్టి కృషి అవసరం



మాట్లాడుతున్న ఎంపీపీ అనసూయమ్మ

తంబళ్లపల్లె: మండలాభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషి అవసరమని ఎంపీపీ అనసూయమ్మ తెలిపారు. శుక్రవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను గుర్తించిన వెంటనే పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. పలు శాఖల అధికారులు తమ శాఖల ద్వారా ఇప్పటి వరకూ చేపట్టిన అభివృద్ధి పనులతో సాధించిన ప్రగతిని వివరించారు. సమావేశంలో కార్యాలయ ఏవో ఆనందకుమార్, మండల ప్రత్యేక ఆహ్వానితులు చినరెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు జమాల్‌బాషా, సింగిల్‌విండో చైర్మన్ భార్గవరెడ్డి, మల్లయ్యకొండ చైర్మన్ మల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కరీమ్, సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



రోడ్డుపై బైక్‌లను పరిశీలిస్తున్న సీఐ, కమిషనర్

బి.కొత్తకోట: బి.కొత్తకోట పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణపై, రోడ్లపై బైక్ పార్కింగ్‌పై కఠినచర్యలు చేపట్టేందుకు శుక్రవారం సీఐ సూర్యనారాయణ, కమిషనర్ పిఆర్.మనోహర్ చర్యలు చేపట్టారు. మదనపల్లె, ములకలచెరువు వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సులు ఆస్పత్రి వద్దే నిలుస్తున్నాయి. జ్యోతిచౌక్‌లో బస్సులు ఆగకపోవడంతో ప్రజలు బైక్‌లను నడిరోడ్డుపైనే నిలిపి ఉంచి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారు. బీరంగిరోడ్డు 90 అడుగుల వెడల్పు ఉన్నప్పటికి దుకాణదారులు రోడ్డును ఆక్రమించేశారు. దీన్ని పరిశీలించిన సీఐ, కమిషనర్‌లు, రోడ్డుకు ఇరువైపులా గీతలు వేసి వాటి ని దాటి బైక్‌లను నిలిపివుంచితే జరిమానా వేసేలా నిర్ణయించారు. ం ములకలచెరువు, చేలూరు నుంచి బి.కొత్తకోట మీదుగా బెంగళూరు వైపు వెళ్లే భారీ వాహనాలు పట్టణంలోని రాకుండా ఇందిరమ్మ కాలనీ మీదుగా మరపల్లె వద్ద బెంగళూరు రోడ్డులో కలిసే మార్గంలో వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా నిషేధించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మదనపల్లె : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో, సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాలు తలపెట్టిన రైతాంగ, పారిశ్రామిక కార్మిక బంద్ సందర్భంగా నిరసనలు వెల్లువెత్తాయి. ముందుగా పట్టణంలోని బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, హెడ్ పోస్ట్ ఆఫీసు మూత వేయించి బంద్ చేపించారు. ఈ సందర్భంగా పట్టణంలో స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తహసిల్దార్ కార్యాలయం ముందు బెంగళూరు రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. ఐసీడీఎస్ కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరిన అంగన్వాడీలు చిత్తూరు బస్టాండ్ సర్కిల్ నందు మానవహారం ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. "ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల నాయకులు పవన్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సుధాకర్, సిఐటియు నాయకులు ప్రభాకర్ రెడ్డి, నారాయణ, ఖదీర్ అహ్మద్, రాజశేఖర్, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వంతో దేశానికి ప్రమాదం

మదనపల్లె : బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీకన్నా బీజేపీ ప్రభుత్వమే దేశానికి ప్రమాదమని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కె మురళి, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వర్రి సురేష్ కుమార్, ఎఐటియుసి పట్టణ కార్యదర్శి తిరుమలప్ప అన్నారు. శుక్రవారం భారత్ గ్రామీణ బంద్ సందర్భంగా మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం నుంచి బెంగళూరు బస్టాండ్ మీదుగా పోస్ట్ ఆఫీస్ సర్కిల్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో కార్మిక శ్రామిక రైతాంగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. కార్యక్రమంలో మస్తాన్. ముబారక్. పృథ్వీరాజ్. వాసు. ఇంద్రాణి,గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బిడ్డ చదువుకు ఎంపీ, ఎమ్మెల్యే చేయూత



ఎంపీ, ఎమ్మెల్యే సహకారంతో డిప్లమో పూర్తి చేసిన దీప్తి

పెద్దతిప్పసముద్రం: అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న ఓ రైతు కుటుంబానికి ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి బాసటగా నిలిచారు. అంతేగాక వారు గతంలోనే మతుడి కుటుంబాన్ని పరామర్శించి రైతు బిడ్డ చదువుకు అయ్యే ఖర్చును తామే పూర్తిగా భరిస్తామని భరోసా ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కాట్నగల్లు పంచాయతీ ఉయ్యాలవారి పల్లికి చెందిన రైతు కామిరెడ్డి వెంకట్రమణారెడ్డి (42) అప్పుల బాధ తాళలేక గత ఏడాది ఫిబ్రవరి 6న ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పట్లోనే ఎంపీ, ఎమ్మెల్యేలు మతుడి భార్య రామలక్ష్మమ్మను పరామర్శించారు. అంతేగాక సత్య సాయి జిల్లా గోరంట్ల సమీపంలో అగ్రికల్చర్ డిప్లమో చదువుతున్న మతుడి కుమార్తె దీప్తి చదువుకు అవసరమయ్యే రూ.3.10 లక్షల ఫీజును తామే చెల్లిస్తామని భరోసా ఇచ్చారు. ఇందులో భాగంగా మొదటి విడతలో రూ.1.50 లక్షల ఫీజు సొమ్మును గత ఏడాది చెల్లించగా చివరి విడతగా రూ.1.60 లక్షల నగదు ఫీజు సొమ్మును ఎంపీ, ఎమ్మెల్యేలు గురువారం కళాశాలకు జమ చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

'సిద్ధం'సభను విజయవంతం చేయండి

పీలేరు : అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే సిద్ధం సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం శ్రీనాథరెడ్డి స్వగృహంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి, జీనత్‌షఫీ, హుమయూన్, హబీబ్‌బాషా, ఆనంద, ఉదయ్, షాకీర్, జావిద్, దావూద్, కాలనీ చిన్న, మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

కలికిరి: ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రామక్రిష్ణ అన్నారు. మండలంలోని పల్లవోలు గ్రామం గడిలో శుక్రవారం జగనన్న ఆరోగ్యసురక్ష క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్యాంపుల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి, ప్రాథమిక స్థాయిలోనే వ్యాధులను గుర్తిండం జరుగుతుందన్నారు. అలాగే అవసరమైన వారికి వైద్య సిబ్బంది విధిగా ఇంటికే ఉచితంగా మందులు అదజేయనున్నట్లు తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా వలంటీర్లు, వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మేడికుర్తి పీహెచ్‌సీ వైదాధికారి చిన్నరెడ్డెప్ప, సర్పంచ్ బీబీ ఆయేషా, ఈఓపీఆర్డీ పరుశురాం, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ జుబేర్ అహ్మద్, నాయకులు ఇస్తియాక్, జునేద్, షమీవుల్లా, నూరు, ఏజాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం కోసం డీవార్మింగ్

పీలేరు : విద్యార్థులకు మెరుగైన ఆరోగ్యం కోసం డీవార్మింగ్ మాత్రలు ఇస్తున్నట్లు జిల్లా ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ శివప్రతాప్ అన్నారు. శుక్రవారం పీలేరు పట్టణం కోటపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం 370 మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేసి వందశాతం పూర్తి చేసినట్లు తెలిపారు. కౌమారబాలికల్లో శారీరక, మానసిక అభివృద్ధి శరవేగంగా జరిగేందుకు దినాలలో ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్ర, ఆల్బెండజోల్, వ్యాధినిరోధక టీకాలు విధిగా తీసుకోవాలన్నారు.